వెల్‌కం గణేశా..

ఇంటింటికీ గణపతి ప్రతిమల పంపిణీ

వినాయక చవితి వేడుకలు శనివారం ఘనంగా జరుగనున్నాయి. పండుగ సందర్భంగా ఆలయాలను నిర్వాహకులు ముస్తాబు చేశారు. మట్టి గణపతి విగ్రహాలను పలుచోట్ల పంపిణీ చేశారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది బస్తీలు, కాలనీల్లో మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


మట్టి గణపతులు పంపిణీ చేస్తున్న బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ


మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర


మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న ఏసీపీ సర్దార్‌సింగ్


మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న మోండా కార్పొరేటర్ కొంతం దీపిక


సనత్‌నగర్‌లో పంపిణీ చేస్తున్న వెల్లాల రామ్మోహన్

గణపతి ప్రతిమల తయారీపై అవగాహన



సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల, ఇకో క్లబ్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా పర్యావరణహిత గణపతి ప్రతిమల తయారీపై గురువారం కళాశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విభుది బ్రదర్స్ ఆధ్వర్యంలో పాటల ద్వారా విద్యార్థులకు పర్యావరణంపై చైతన్యం కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ వసుధ , ఉషారాణి, వెంకటేశ్వర్లు, స్నేహ, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి



లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని శ్రీపురి కాలనీకి వెళ్లే మార్గంలో నిలిచిపోయిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ బి. యాదగిరి డిమాండ్ చేశారు. గతంలో పలుమార్లు ఆయన చేసిన ఫిర్యాదుతో గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులు గుంతలమయంగా మారిన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ ముందు చూపు లేకుండా అధికారులు రోడ్డును తవ్వ సీసీ రోడ్డు నిర్మాణం చేయలేకపోయారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఈ వేణు, వర్క్ ఇన్స్‌పెక్టర్, కాలనీ వాసులు రాజేష్ తదితరులున్నారు.

ఎమ్మెల్సీ కోదండరామ్‌కు సత్కారం



లాలాపేట: తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు గురువారం ఎమ్మెల్సీ ప్రొ కోదండరాంను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని, కోదండరామ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డా. పి. మోహన్‌రావు, భానుప్రసాద్, రామ్మోహన్‌రెడ్డి, డా. లక్ష్మీనారాయణ, హరికుమారి,నిరంజన్‌బాబు, రజిని తదితరులున్నారు.

మట్టి గణపతి ప్రతిమలనే ప్రతిష్ఠించాలి


మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

లాలాపేట: పర్యావరణ హితానికి ప్రతి ఒక్కరూ మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించి పూజించాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి అన్నారు. గురువారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయం వద్ద ప్రజలకు ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోతె శోభన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు సుభాష్, ఇతర విభాగాల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డిజిటల్ మాజీ డైరెక్టర్ దిలీప్‌ను విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ వాది, మాజీ డిజిటల్ డైరెక్టర్ కొణతం దిలీప్‌ను వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్ నేత, ఓయూ విద్యార్థి జేఏసీ తొలి అధ్యక్షులు మర్రి అనిల్ కుమార్ గురువారం డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కుతో కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలన పై సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియచేస్తున్న దిలీప్‌ను టార్గెట్ చేసి అక్రమంగా అరెస్ట్ చేయాడం దారుణమన్నారు. ఎలాంటి పోలీసు ఎఫ్ఆర్ఐ లేకుండ కేవలం సీఎంవో కార్యాలయం ఆదేశాల మేరకు దిలీప్‌ను అరెస్ట్ చేయడం అన్యాయం అన్నారు.

పరామర్శ



సనత్‌నగర్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొల్లాపూర్ లక్ష్మణ్ కుటుంబసభ్యులను బీజేపీ రాష్ట్ర యువజన నాయకుడు మర్రి పురురవరెడ్డి గురువారం పరామర్శించారు. లక్ష్మణ్ మృతి విషయాన్ని తెలుసుకున్న ఆయన బేగంపేట పాటిగడ్డలోని నివాసానికి చేరుకున్నారు. లక్ష్మణ్ కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా కొంత ఆర్థిక సహాయం అందించారు.

ఉరేసుకున్న వ్యక్తిని కాపాడిన పోలీసులు

రాంగోపాల్‌పేట్: ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఉరివేసుకున్న ఓ వ్యక్తిని పోలీసులు కాపాడారు. వివరాలు.. రెజిమెంటల్‌బజార్‌కు చెందిన ఓ 40 ఏళ్ల వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం ఉరివేసికున్నాడు. గమనించిన స్థానికులు 100కు ఫోన్ చేయడంతో గోపాలపురం పెట్రోకార్‌లో విధులు నిర్వహించే కానిస్టేబుల్ శ్రీనివాస్, హోంగార్డు మల్లేష్ హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. వెంటనే తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా ఉరివేసికున్న వ్యక్తి అప్పటికే ఎలాంటి చలనం లేకుండా ఉన్నాడు. వెంటనే పోలీసులు అతనికి సీపీఆర్ చేయగా కొద్దిసేపటికి చలనం వచ్చింది. వెంటనే స్థానికంగా ఉండే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

గురుభ్యోనమః

ఘనంగా గురుపూజోత్సవం

విద్యార్థుల సందడి

గురుపూజోత్సవం సందర్భంగా గురువారం వివిధ పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి సందడి చేశారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.


సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీ గణేష్


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీనివాస్


బెస్ట్ టీచర్ గీతా కుమారిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రసూల్‌పురా: తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు చిన్నారులను క్రమశిక్షణతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు. టీచర్స్‌డే సందర్భంగా తిరుమలగిరి నెహ్రూ సెంటినరి కాలనీలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురువారం ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీచర్స్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు బిక్షపతి రెడ్డి, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, మంజు భార్గవి, మోహన్ రెడ్డి రామ్‌రెడ్డి, సరిత తదితరులు పాల్గొన్నారు.

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్ రోటరాక్ట్ క్లబ్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు సంజనతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రసూల్‌పురా: భారత ఉపరాష్ట్రపతి భారత రత్న డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా టీచర్స్‌డే పురస్కరించుకుని గురువారం రసూల్‌పురా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకులు టిఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల హెచ్‌ఎం రంగనాథ్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గణేష్‌కుమార్ పాల్గొన్నారు.


మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో...

లాలాపేట: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం, డా. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలను గురువారం తార్నాక డివిజన్ పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించారు. లాలాపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎన్నికైన ఎస్‌జీటీ గీతాకుమారిని ఘనంగా సన్మానించారు.

రాంగోపాల్‌పేట్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. రెజిమెంటల్‌బజార్‌లోని నంబర్ వన్ స్కూల్‌లో బాబూరావు ముదిరాజ్, బద్రినాథ్‌యాదవ్, నందికంటి రవి, శ్రీనివాస్, నాగేష్ యాదవ్, మోహన్, శ్రీనాథ్, అనిల్ యాదవ్ తదితరులు కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.


కేక్ కట్ చేసి ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


ఉత్తమ అవార్డు అందుకున్న ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

లాలాపేట: మనదేశంలో రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే అని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. గురువారం తార్నాకలోని ఇరిసెట్ ఉద్యోగులకు రోడ్డు ప్రమాదాలు-నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలనీ కోరారు. మద్యం మత్తులో వాహనం నడిపే వ్యక్తి బాధ్యతారాహిత్యానికి పాల్పడితే అనేకమంది ప్రాణాలు కోల్పోతారని తెలిపారు. కార్యక్రమంలో ఇరిసెట్ డైరెక్టర్ జనరల్ శ్రీవాస్తవ, అడిషినల్ డైరెక్టర్ జనరల్ రాజశేఖర్ పాల్గొన్నారు.


ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలి


జిమ్ ప్రారంభ కార్యక్రమం సందర్భంగా వ్యాయామం చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ వారాసీగూడలో ఏర్పాటు చేసిన హల్క్ జిమ్‌ను సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులు, యువకులు వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అన్ని కాలనీలు, బస్తీల ప్రజల సౌలభ్యం కోసం పార్కుల్లో ఏర్పాటు చేసిన జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, బీఆర్‌ఎస్ నాయకులు సుంకు రాంచందర్, అశ్విని కుమార్, పాక సాయి, జిమ్ నిర్వాహకుడు కిషోర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం..

బన్సీలాల్‌పేట్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పూజించాలని కార్పొరేటర్ కె. హేమలత ప్రజలకు సూచించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్ కమ్యూనిటీహాల్ వద్ద గురువారం జీహెచ్‌ఎంసీ అధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈ ధర్మారెడ్డి, ఎస్ఎస్ దానా గౌడ్, స్థానిక నాయకులు రమణ, రమేష్, లక్ష్మీ, వెంకటేష్ యాదవ్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.


మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ హేమలత

అడ్డగుట్ట: పర్యావరణ పరిరక్షణకు అందరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి సూచించారు. గురువారం అడ్డగుట్టలోని కార్పొరేటర్ కార్యాలయంలో ఆమె మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ రసాయన రంగులతో చేసిన విగ్రహాల కారణంగా పర్యావరణం కలుషితం అవుతుందన్నారు.



కులగణన తర్వతే ఎన్నికలు జరపాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో కులగణన చేపట్టిన తర్వతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల కమీషన్ పార్థసారథికి గురువారం బీసీ నేత జాజుల లింగంగౌడ్ వినతి పత్రం సమర్పించారు. కాంగ్రెస్ నేతలు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు.

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు



అడ్డగుట్ట: పోషణ పక్ష మాసంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వీరు తెలిపారు. సికింద్రాబాద్ ప్రాజెక్ట్ అడ్డగుట్ట సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక ఆహార లోపం కారణంగా బాధపడుతున్న చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి పౌష్టికాహారంపై పిల్లల తల్లులకు డాక్టర్ వీరు అవగాహన కల్పించారు.

మదర్ థెరీసాకు నివాళులు

రాంగోపాల్‌పేట్: పేద, కుష్ఠు రోగులకు మదర్ థెరీసా చేసిన సేవలను ఎప్పటికీ నిలిచిపోతాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. మదర్ థెరీసా వర్ధంతి సందర్భంగా రెజిమెంటల్‌బజార్‌లోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సందర్భంగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబురావు, నందికంటి రవి, బద్రినాథ్ యాదవ్, శ్రీనివాస్, అనిల్, సోమేష్, విజయ్ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం స్ఫూర్తిదాయకం..

సనత్‌నగర్: సమాజంలోని అంధకారాన్ని తొలగించి వెలుగులు ప్రసాదించే శక్తి ఒక్క ఉపాధ్యాయునికే ఉందని ఎన్‌డీఎంఏ మాజీ వైస్‌చైర్మన్, సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 136వ జయంతిని పురస్కరించుకుని ట్యాంక్‌బండ్‌పై సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి ఆయన మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావుతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర యువనేత మర్రి పురురవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ



బౌద్ధనగర్: పదవీ విరమణ పొందిన జీహెచ్‌ఎంసీ అటెండర్‌ను సిబ్బంది ఘనంగా సన్మానించారు. బౌద్ధనగర్‌లోని వార్డు కార్యాలయంలో గురువారం అటెండర్ తిరుమల్ కుమార్ పదవీ విరమణ సభను నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ ఏఎంసీ ఓమర్, కార్పొరేటర్ కంది శైలజ పాల్గొన్నారు.

మట్టి గణపతులను అందుబాటులో ఉంచండి

ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

సికింద్రాబాద్: పర్యావరణ పరిరక్షణకు ప్రాముఖ్యతను కల్పించడంలో భాగంగా వినాయక చవితి పండగ సందర్భంగా ప్రజలు మట్టి గణపతులను పూజించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో చేపట్టిన మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని పద్మారావు గౌడ్ తన క్యాంపు కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో డివిజన్‌కు 800 చొప్పున మొత్తంగా 4 వేల మట్టి వినాయకులను బల్దియా యంత్రాంగం పంపిణీ చేస్తుందని చెప్పారు. అన్ని మునిసిపల్ డివిజన్ల వార్డు కార్యాలయాల్లో మట్టి వినాయక ప్రతిమలను అందుబాటులో ఉంచాలని ఆయన అధికారులకు సూచించారు. కార్పొరేటర్ సామల హేమ, బీఆర్‌ఎస్ నాయకులు తీగుల్ల రామేశ్వర్ గౌడ్, గుండవేని రాజేష్ గౌడ్, రాజసుందర్, మినుపగుండ్ల సంస్థ మార్కెటింగ్ అధికారి జి.ప్రవీణ్ గౌడ్ పాల్గొన్నారు.


మట్టిగణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్

చెరువును పరిశీలించిన తహసీల్దార్


తూము నిర్మాణంపై అభ్యంతరం తెలుపుతున్న ప్లాట్ల ఓనర్లు

లాలాపేట: తార్నాకలోని ఎర్రకుంట చెరువును గురువారం మారెడుపల్లి తహసీల్దార్ భీమయ్య గౌడ్ పరిశీలించారు. చెరువు పునరుద్ధరణలో భాగంగా ఇరిగేషన్ అధికారులు కల్వర్టు (తూము) నిర్మాణాన్ని తలపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న మారుతీనగర్ వాసులు ఆ పనులను అడ్డుకున్నారు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా ఆయన ఆ ప్రాంతానికి వచ్చారు. ఇప్పటికే ప్రభుత్వం ఐదున్నర ఎకరాల చెరువు భూమిని ఎఫ్‌టీఎల్‌గా నిర్ధారించిందని, కానీ దానిపై ప్రభుత్వానికే స్పష్టత లేదన్నారు. నిర్ధారించిన ఎఫ్‌టిఎల్‌ను అభివృద్ధి చేయకుండా చుట్టు పక్కల భూముల్లో ఏవిధంగా పనులు చేస్తారని వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. మరో వైపు చెరువు భూములపై వివాదం కోర్టులో ఉందన్నారు. ఇలాంటి పరిస్థితిలో ఇరిగేషన్ అధికారులు ఏవిధంగా పనులు చేస్తున్నారని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే పట్టా కాగితాలు ఉన్నవారు తమ కార్యాలయంలో సంప్రదించాలనీ సూచించి వెళ్లిపోయారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో టమాటా కిలో.. రూ.25, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 35, పందిరి బీర 45, క్యాబేజీ 15, క్యారెట్ 55, దొండ 28, గుండుబీన్స్ 90, గింజ చిక్కుడు 75, గోకరకాయ 28, కీర 25, దోసకాయ 15, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 44, ఆలుగడ్డ 38, చామగడ్డ 40, మొరంగడ్డ 55, కందగడ్డ 55, సొరకాయ 13, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 5-6, ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

10న ఎస్ఎఫ్ఐ విద్యార్థి మహాగర్జన

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఇందిరా పార్క్ వద్ద విద్యార్థి మహాగర్జన నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి గురువారం తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్‌తో మహాగర్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పేదల మాస్టారుకు ఘన నివాళి



సికింద్రాబాద్: సీతాఫల్‌మండి కూడలిలో గురువారం అమరావతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పేదల మాస్టారుగా పేరుపొందిన మాస్టారు వట్టిపల్లి కోటేశ్వరరెడ్డి విగ్రహం వద్దకు ర్యాలీగా తరలివచ్చిన విద్యార్థులు పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. అమరావతి విద్యా సంస్థల నిర్వాహకులు ప్రసన్నకుమార్‌రెడ్డి,నివాస్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాంగ్‌రూట్‌పై స్పెషల్ నజర్

బంజారాహిల్స్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి రాంగ్‌రూట్‌లో వస్తున్న 50 మంది వాహదారులను బంజారాహిల్స్ పోలీసులు గుర్తించి జరిమానాలు విధించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. గురువారం బంజారాహిల్స్ రోడ్డునెంబర్ 1/12 చౌరస్తాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రాంగ్‌రూట్‌లో వస్తున్న వారిని తనిఖీల్లో భాగంగా పట్టుకున్నారు. వీరి వల్ల ఇతరులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, రాంగ్‌రూట్ డ్రైవింగ్ మంచిది కాదని పలు సూచనలు చేశారు.